అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people



## టెట్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**


02

మంగళవారం 16, జూన్ 2026 సంపుటి :03 సంచిక :125 పేజీలు :05 వెల ₹5

# కాళేశ్వర ఆలయానికి మహా రూపం

- రూ.198 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం
- పునఃప్రతిష్ఠ పనులకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు
- రేపటి నుంచి ప్రధాన ఆలయం తాత్కాలిక మూసివేత
- ఆది ముక్తీశ్వర ఆలయం వద్దే స్వామివారి దర్శనాలు
- అభిషేక పూజలకు బ్రేక్.. కాలసర్ప, శని పూజలు యథావిధి
- పుష్కరాల నాటికి పనులను పూర్తి చేయడమే లక్ష్యం






భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు పతాక స్థాయికి చేరాయి. ఒకప్పుడు తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారికి కంచుకోటగా ఉన్న ఈ ఇలాకాలో.. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి (జీవీఆర్) పాగా వేయడంతో గులాబీ దళంలో అంతర్గత యుద్ధం మొదలైంది. నియోజకవర్గంలో పార్టీ స్పష్టంగా రెండు వర్గాలుగా చీలిపోవడమే కాకుండా.. ఏకంగా రెండు వేర్వేరు పార్టీ కార్యాలయాలు నడుస్తుండటం ఇక్కడి తీవ్రతకు అద్దం పడుతోంది. మొన్నటి సింగరేణి సదస్సులో మాజీ మంత్రి హరీశ్ రావు సాక్షిగానే ఇరు వర్గాలు 'గో బ్యాక్' నినాదాలు, తోపులాటలతో రచ్చకెక్కడం గులాబీ శ్రేణుల్లో కలకలం రేపింది. ఈ గ్రూపు రాజకీయం కాస్తా ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీకి వరంగా మారడంతో.. అధిష్ఠానం మౌనం వీడకుంటే భూపాలపల్లిలో కారు బోల్తా పడటం ఖాయమనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

— మొగుళ్లపల్లి, అక్షరదర్బార్

- భూపాలపల్లి గులాబీ దళంలో ముదిరిన అంతర్గత వార్!
- ఒకే నియోజకవర్గం.. రెండు పార్టీ కార్యాలయాలు
- రెండు వర్గాలుగా.. ఎవరికి వారే యమునా తీరే
- హరీశ్ రావు సాక్షిగా రచ్చరచ్చ.. 'గో బ్యాక్' నినాదాలు, తోపులాటలు
- కాంగ్రెస్ కు కలిసి వస్తున్న గులాబీ ఫైట్

02

# వర్ధన్నపేటలో టాస్క్‌ఫోర్స్ దాడి

- భారీగా ఎక్స్‌పైర్డ్ పురుగుమందులు స్వాధీనం
- రూ.6.86 లక్షల విలువైన నిషేధిత, గడువు ముగిసిన స్టాక్ సీజ్
- అన్నదాత అగ్రో ఏజెన్సీస్ నిర్వాహకుడు రాపర్తి రాజ్ అరెస్ట్

02




## టెట్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: టెట్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం ప్రారంభమై 22 వరకు కొనసాగే టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలకు సంబంధించి పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేయబడతాయని, ఈ ఉత్తర్వుల ప్రకారం పరీక్ష జరిగే 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులుగా గుమి కూడటం, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిషేధించబడ్డాయని తెలిపారు. పరీక్ష జరిగే పరిసరాల్లో పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, ఈ ఉత్తర్వులు ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతియని, ఎవరైనా ఈ ఉత్తర్వులు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

## అనుమతులు లేకుండా ఐస్‌క్రీమ్ తయారీ

### టాస్క్ ఫోర్స్ దాడిలో రాజస్థాన్ వ్యాపారి అరెస్ట్

అక్షరదర్బార్, వరంగల్: ఖిలావరంగల్ మండలంలోని మామునూరులో అనుమతులు లేకుండా నడుపుతున్న ఒక ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం టాస్క్ ఫోర్స్ బృందం మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యసాయినగర్‌లో గల ఒక అద్దె ఇంట్లో తనిఖీలు చేపట్టింది. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా ఐస్‌క్రీమ్ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడిలో నిందితుడి ఆధీనంలో కుల్ఫీలు, వివిధ రకాల ఐస్‌క్రీమ్ నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వాటిలో రబడీ కుల్ఫీలు 334, బాదాం కుల్ఫీలు 102, పిస్తా కుల్ఫీలు 23, బటర్‌స్కాచ్, స్ట్రాబెర్రీ, వెనిల్లా, పిస్తా, డ్రై ఫ్రూట్, చాక్లెట్ ఐస్‌క్రీమ్‌లు దాదాపు 69 కేజీలు ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తి విలువ సుమారు రూ.30,690 ఉంటుందని టాస్క్ ఫోర్స్ అధికారులు వెల్లడించారు.

#### రశీదులు ఉన్నాయి.. పర్మిషన్ లేదు

తనిఖీ సమయంలో సదరు వ్యాపార సంస్థ యజమాని చూపించిన కొనుగోలు రశీదులను పోలీసులు పరిశీలించారు. అయితే, నివాస ప్రాంతంలో ఐస్‌క్రీమ్‌లు తయారు చేయడానికి, విక్రయించడానికి ఎలాంటి చట్టపరమైన అనుమతులు లేవని తేలింది. దీంతో తనిఖీలు పూర్తి చేసిన టాస్క్ ఫోర్స్ బృందం, నిబంధనల ప్రకారం తదుపరి కఠిన చర్యల నిమిత్తం ఈ కేసును ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కి బదిలీ చేసింది.

#### రాజస్థాన్ వ్యాపారి అరెస్ట్

ఈ అక్రమ ఐస్‌క్రీమ్ వ్యాపారానికి పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కన్హయ్య లాల్ జాట్, స్వస్థలం రాజస్థాన్ రాష్ట్రంలోని భిల్వారా జిల్లా, మండల్ గ్రామం. ప్రస్తుతం ఇతడు మామునూరులోని నాయుడు పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న సత్యసాయినగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ కె శ్రీధర్, ఎస్సై టి. వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతూ, అనుమతులు లేకుండా ఇలాంటి కేంద్రాలు నిర్వహిస్తే సహించేది లేదని అధికారులు హెచ్చరించారు.



# సిరికొండ వర్సెస్ గండ్ర

- చారి ఇలాకాలో జీవీఆర్ పాగా
- భూపాలపల్లి గులాబీ దళంలో ముదిరిన అంతర్గత వార్!
- ఒకే నియోజకవర్గం.. రెండు పార్టీ కార్యాలయాలు
- రెండు వర్గాలుగా.. ఎవరికి వారే యమునా తీరే
- హరీశ్ రావు సాక్షిగా రచ్చరచ్చ.. 'గో బ్యాక్' నినాదాలు, తోపులాటలు
- కాంగ్రెస్ కు కలిసి వస్తున్న గులాబీ ఫైట్



అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు తారస్థాయికి చేరాయి. ఒకప్పుడు సిరికొండ మధుసూదనాచారి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో.. ఇప్పుడు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పట్టు బిగించారు. "సిరికొండ ఇలాకాలో గండ్ర పాగా" వేశారంటూ స్థానిక కేడర్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ఇద్దరు అగ్ర నేతల మధ్య విభేదాలు భగ్గుమనడంతో పార్టీ శ్రేణులు రెండుగా చీలిపోయాయి.

### రెండుగా చీలిన పార్టీ.. ఎవరికి వారే యమునా తీరే

ప్రస్తుతం నియోజకవర్గంలో ఇరువురి నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఎవరికి వారే విడివిడిగా మండలాల్లో సమావేశాలు, పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విచిత్రం ఏంటంటే.. ఒకే నియోజకవర్గంలో ఇరువురి పేర్లతో వేర్వేరుగా రెండు పార్టీ కార్యాలయాలు నడుస్తుండటం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. కార్యకర్తలు సైతం స్పష్టంగా 'గండ్ర వర్గం', 'సిరికొండ వర్గం' అంటూ విడిపోయారు.

### హరీశ్ రావు సాక్షిగా 'జై కొట్టుడు'.. రచ్చరచ్చ

కొద్దిరోజుల క్రితం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సింగరేణి పరిరక్షణ సదస్సులో మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సమక్షంలోనే ఈ విభేదాలు కాస్తా బట్టబయలయ్యాయి. గండ్ర వెంకటరమణా రెడ్డి మాట్లాడుతుండగా ఆయన వర్గీయులు "జై గండ్ర" అంటూ నినాదాలు, డాన్సులతో హోరెత్తించారు. దీనికి ప్రతిచర్యగా సిరికొండ వర్గం సైతం ఈలలు, జై జై నినాదాలతో ప్రతిఘటించింది. ఒక దశలో ఇరు వర్గాల మధ్య 'గో బ్యాక్' నినాదాలు, తోపులాటలతో సభా ప్రాంగణం తీవ్ర ఉద్రిక్తతంగా మారింది. పరిస్థితి చేయి దాటుతుండటంతో సిరికొండ మధుసూదనాచారి స్వయంగా జోక్యం చేసుకుని తన వర్గాన్ని శాంతింపజేశారు. వేదికపై ఉన్న మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్ ఈ పరిణామాలకు మౌన సాక్షులుగా మిగిలిపోవడం గమనార్హం.

### అయోమయంలో కేడర్.. అధిష్ఠానం మౌనం ఎన్నాళ్లు?

పార్టీ ఇప్పటికే కష్టకాలంలో ఉంటే, ఇలాంటి సమయంలో సీనియర్ నేతలు వీధిన పడటంపై కింది స్థాయి కేడర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఎటు వెళ్లాలో, ఎవరి వెంట నడవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. "పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదు" అని సీనియర్ కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పార్టీ అధిష్ఠానం ఇప్పటివరకు స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

### కాంగ్రెస్ కు కలిసి వస్తున్న 'గులాబీ' ఫైట్!

బీఆర్ఎస్ అంతర్గత కుమ్ములాటలు ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీకి బాగా కలిసి వస్తున్నాయి. గ్రామస్థాయిలో కాంగ్రెస్ కేడర్ ఈ గ్రూపు రాజకీయాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటూ బలాన్ని పెంచుకుంటోంది. ఇప్పటికైనా అధిష్ఠానం పెద్దలు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను కూర్చోబెట్టి సర్దుబాటు చేయకపోతే.. భూపాలపల్లిలో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ తగలడం ఖాయమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

## ఆకలి తీర్చడం మహా సంకల్పం



అక్షరదర్బార్, హనుమకొండ: అన్నార్తుల ఆకలి తీర్చడం మహా సంకల్పమని, మానవసేవయే మాధవసేవ అన్న నానుడికి నిదర్శనం భద్రకాళి సేవాసమితి నిర్వాహకుల సంకల్పం అన్నప్రసాద వితరణ అని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కాళీ ప్రసాద్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలో సోమవారం నిర్వహించిన అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించడమే కాకుండా ఎండ వేడిమిని తట్టుకొని అన్నార్తులకు సేవ చేస్తున్నందుకు భగవంతుడు సంకల్పాన్ని ఆశీర్వదించే విధంగా ఉండడం శుభసూచకమని చెప్పారు. ప్రతి నెల అమావాస్య రోజున నిర్వహించే కార్యక్రమానికి తన వంతు సహకారం కూడా అందిస్తానని చెప్పారు. సుమారు 600 మందికి అన్న ప్రసాదం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పిన్నా శివకుమార్, చోల్లేటి శ్రీధర్, మహేష్, పొడిచెట్టి విష్ణువర్ధన్, నల్లా దిలీప్, ప్రభాకర్, రిటైర్డ్ హెడ్మాస్టర్ నారాయణరెడ్డి, రిటైర్డ్ ఎల్ఐసీ అధికారి పాములపర్తి కేశవకుమార్, సీనియర్ న్యాయవాది అల్లం రాజేష్ వర్మ పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరు కాని నిందితుడికి రిమాండ్

### పరకాల సబ్ జైలుకు తరలింపు

అక్షరదర్బార్, కాళేశ్వరం: మహాదేవపూర్ మండలంలోని పెద్దంపేట గ్రామంలో 2020లో నమోదైన దాడి, ఆస్తి ధ్వంసం కేసులో కోర్టు విచారణలకు హాజరు కాకపోవడంతో నిందితుడు దుర్గం సురేష్‌ను మహాదేవపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని భూపాలపల్లి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. పోలీసుల వివరాల ప్రకారం, బాధితుడిని బూతులు తిట్టి చేతులతో కొట్టడంతో పాటు ఆటోకు అడ్డుగా నిలబడి కర్రతో ఆటో అద్దాన్ని పగలగొట్టి నష్టం కలిగించిన ఘటనకు సంబంధించి కేసు నమోదైంది. అనంతరం కోర్టు విచారణలకు దుర్గం సురేష్ హాజరు కాకపోవడంతో మెజిస్ట్రేట్ ఆయనపై నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. ఈ మేరకు సోమవారం మహాదేవపూర్ ఎస్సై ఎం సాంబమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడిని పట్టుకుని భూపాలపల్లి మెజిస్ట్రేట్ ఎదుట ప్రవేశపెట్టారు. విచారణ అనంతరం మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడికి రిమాండ్ విధించి పరకాల సబ్ జైలుకు తరలించారు. కోర్టు పేసీలకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా విచారణకు హాజరు కావాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుని జైలుకు పంపిస్తామని మహాదేవపూర్ ఎస్సై ఎం సాంబమూర్తి హెచ్చరించారు.

# కాళేశ్వర ఆలయానికి మహా రూపం

- రూ.198 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం
- పునఃప్రతిష్ఠ పనులకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు
- రేపటి నుంచి ప్రధాన ఆలయం తాత్కాలిక మూసివేత
- ఆది ముక్తీశ్వర ఆలయం వద్దే స్వామివారి దర్శనాలు
- అభిషేక పూజలకు బ్రేక్.. కాలసర్ప, శని పూజలు యథావిధి
- పుష్కరాల నాటికి పనులను పూర్తి చేయడమే లక్ష్యం



అక్షరదర్బార్, కాళేశ్వరం : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులు కీలక దశకు చేరుకున్నాయి. గత నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి రూ.198 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆలయ పునఃప్రతిష్ఠ, పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శృంగేరి పీఠాధిపతి శ్రీ విదుశేఖర భారతి మహాస్వామి వారి శిష్యుల బృందం ఆధ్వర్యంలో ఈ నెల 17న ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొని పనులను అధికారికంగా ప్రారంభించనున్నారు.

### రేపటి నుంచి 'ప్రధాన ఆలయం' మూసివేత

ఆలయ పునర్నిర్మాణ పనుల నేపథ్యంలో రేపటి నుంచి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ప్రధాన ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. పనులు పూర్తయ్యే వరకు భక్తుల దర్శనాలు, ఇతర సేవలు ఆది ముక్తీశ్వర స్వామి వారి ఆలయం వద్ద నిర్వహించనున్నారు.

### అభిషేక పూజలకు తాత్కాలిక విరామం

ఆది ముక్తీశ్వర స్వామి వారి ఆలయం పరిమిత స్థలంలో ఉండటంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అభిషేక పూజలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు. ప్రస్తుతం భక్తులకు స్వామివారి దర్శనాలు మాత్రమే కల్పించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

### దోష నివారణ పూజలు యథావిధి..


ప్రధాన ఆలయం మూసివేసినప్పటికీ భక్తులు ఎంతో పవిత్రంగా భావించే కాలసర్ప దోష నివారణ పూజలు, శని దోష నివారణ పూజలు, నవగ్రహ పూజలకు ఎలాంటి ఆటంకం ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఆది ముక్తీశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలోనే ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి భక్తులకు ఈ పూజలు నిర్వహించనున్నారు. భక్తుల సంఖ్య ఎంత పెరిగినా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక క్యూలైన్లు, పూజా కౌంటర్లు, అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు.

### భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేకంగా లడ్డూ, పులిహోర ప్రసాదాల పంపిణీ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

### లక్ష్యం.. గోదావరి పుష్కరాలు

వచ్చే ఏడాది జరగబోయే గోదావరి పుష్కరాల నాటికి ఆలయ పునర్నిర్మాణ పనులను పూర్తి చేయాలనే పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఆధునిక సౌకర్యాలతో పాటు ఆలయ ప్రాచీన ఆధ్యాత్మిక వైభవాన్ని, సంస్కృతిని కాపాడేలా ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. తాత్కాలికంగా చేసిన ఈ మార్పులకు భక్తులందరూ సహకరించాలని ఆలయ వర్గాలు కోరాయి.



అక్షరదర్బార్, హనుమకొండ: సీనియర్ జర్నలిస్ట్, టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తిని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు శాలువాతో సత్కరించి బోకే అందజేశారు. ఇటీవల జరిగిన టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా సంఘం ఎన్నికల్లో కేశవమూర్తి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల వెంకటేశ్వర్లు సంతోషం వ్యక్తం చేశారు. టీయూడబ్ల్యూజే పటిష్టతతో పాటు, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. వరంగల్ వాయిస్ కార్యాలయంలో జరిగిన ఈ సన్మానోత్సవ కార్యక్రమంలో తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ ప్రెసిడెంట్ పెరుమానుల తిరుపతి, సహాయ కార్యదర్శి బూర వెంకటేష్, సిహెచ్ సాంబయ్య, ఎండీ యూసుఫ్ఉద్దీన్ పి హనుమాచారి ఈ కార్యక్రమంలో పాల్గొని కేశవమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

# నకిలీ విత్తనాల విక్రయాలపై ఉక్కుపాదం

- పరకాలలో ఆకస్మిక తనిఖీలు..
- పీడీ యాక్ట్ కింద చర్యలకు హెచ్చరిక



అక్షరదర్బార్, పరకాల: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడడంతో పాటు నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాలను అరికట్టేందుకు పరకాల పట్టణంలో సోమవారం అధికారులు విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఐ క్రాంతికుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏ ఆదిరెడ్డి, ఏవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయ కేంద్రాలను పరిశీలించారు. పట్టణంలోని సుమారు 15 విత్తనాలు, ఎరువుల దుకాణాలను సందర్శించిన అధికారులు విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను తనిఖీ చేశారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించారు. ప్యాకెట్లపై ఉన్న తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ వివరాలను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులను మోసం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే కేసులు నమోదు చేసి పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద విత్తనాలు లేదా ఎరువుల గురించి వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో కూడా ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో టాస్క్‌ఫోర్స్ దాడి

- భారీగా ఎక్స్‌పైర్డ్ పురుగుమందులు స్వాధీనం
- రూ.6.86 లక్షల విలువైన నిషేధిత, గడువు ముగిసిన స్టాక్ సీజ్
- అన్నదాత అగ్రో ఏజెన్సీస్ నిర్వాహకుడు రాపర్తి రాజ్ అరెస్ట్



అక్షరదర్బార్, వర్ధన్నపేట: అమాయక రైతులకు నకిలీ, గడువు ముగిసిన వ్యవసాయ పురుగుమందులను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న ఓ వ్యాపారి గుట్టును వరంగల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా నడుపుతున్న ఓ పురుగుమందుల దుకాణంపై టాస్క్ ఫోర్స్ బృందం సోమవారం మెరుపు దాడి నిర్వహించింది. ఈ దాడిలో సుమారు రూ.6,86,905 విలువైన 43 రకాల కాలం చెల్లిన (ఎక్స్‌పైర్డ్) పురుగుమందులను స్వాధీనం చేసుకుని, దుకాణ యజమానిని అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం ప్రకారం.. వర్ధన్నపేట పట్టణ పరిధిలో ఉన్న అన్నదాత అగ్రో ఏజెన్సీస్ లో గడువు ముగిసిన పురుగుమందులను గుట్టుచప్పుడు కాకుండా నిల్వ ఉంచి, వాటిని అమాయక రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఏసీపీ ఎ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి ఉప్పలయ్యల నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ బృందం సదరు దుకాణంపై అకస్మాత్తుగా దాడి చేసింది. ఈ దాడిలో నిందితుడైన దుకాణ యజమాని రాపర్తి రాజ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రంగపురం గ్రామానికి చెందిన సదయ్య కుమారుడిగా గుర్తించారు. ఇతను వర్ధన్నపేటలో ఏజెన్సీని నడుపుతూ లాభాల కోసం కాలం చెల్లిన స్టాక్‌ను విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది.

### భారీగా పట్టుబడిన స్టాక్

పోలీసులు స్వాధీనం చేసుకున్న స్టాక్‌లో భారీగా రసాయనాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా టోటో 250 ఎంఎల్, ఎటిఎమ్ 250, 200 ఎంఎల్, రూలర్ టోల్ఫెన్‌పైరాడ్, అస్త్ర నోవాల్యూరాన్, వీటితో పాటు అప్సరా, టైటాన్, టోల్ఫెటాక్స్, వేప గింజల సారం వంటివి ఉన్నాయి. మొత్తం 43 రకాల కాలం చెల్లిన మందుల బాక్సులను పోలీసులు సీజ్ చేశారు.

### పోలీస్ స్టేషన్‌కు అప్పగింత..

దాడి పూర్తి చేసిన టాస్క్ ఫోర్స్ బృందం, స్వాధీనం చేసుకున్న రూ.6.86 లక్షల విలువైన పురుగుమందుల రికార్డులను, నిందితుడు రాపర్తి రాజ్‌ను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. రైతుల జీవితాలతో ఆడుకుంటూ, నకిలీ లేదా గడువు ముగిసిన మందులు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు హెచ్చరించారు.